క్లుప్తంగా

హెల్త్ సూపర్‌వైజర్‌కు సన్మానం


టేకులపల్లి: శకుంతలను సన్మానిస్తున్న వైద్యాధికారి దినేశ్ తదితరులు

టేకులపల్లి: మండలంలోని సులానగర్ పీహెచ్‌సీలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పనిచేసి ఆదివారం ఉద్యోగ విరమణ పొందిన వీసం శకుంతలను వైద్యాధికారి కందుల దినేశ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. గిరిజన కుటుంబం నుంచి వచ్చి 34 ఏళ్లకుపైగా రహదారులు సరిగ్గా లేని ప్రాంతాల్లో సేవలు అందించారని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో విజయశ్రీ, వజ్జా పార్వతి, సీతమ్మ, భద్రమ్మ, సత్యవతి, దేవా, హరికృష్ణ, చంద్రకళ, దయామణి, తెరోజా, పోరండ్ల శ్రీనివాస్, గుజ్జా విజయ, కృష్ణకుమార్, రమేశ్‌బాబు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఐకి సత్కారం


కొత్తగూడెంరూరల్: ఆర్‌ఎస్‌ఐతో పోలీసులు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని చాతకొండ 6వ బెటాలియన్ ఆర్‌ఎస్‌ఐ వి.నారాయణరాజు ఉద్యోగ విరమణ పొందడంతో ఆదివారం ఆయన్ను సత్కరించారు. 1983 బ్యాచ్‌కు చెందిన ఆయన పోలీస్ కానిస్టేబుల్‌గా 41 ఏళ్లపాటు విధులు నిర్వర్తించారు. కార్యక్రమంలో కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ హెచ్ అబ్దుల్‌రషీద్, బి.జవహర్‌లాల్, ఆర్‌ఐలు రాంబ్రహ్మం, జీవీ రామారావు, స్వామి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీవీకే–5 ఇంక్లైన్‌లో జీఎం పూజలు


మాట్లాడుతున్న జీఎం శాలేంరాజు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పద్మావతిఖని–5 ఇంక్‌లైన్ గనిలో ఆదివారం ఏరియా జనరల్ మేనేజర్ శాలేంరాజు సేఫ్టీ పూజ నిర్వహించి మాట్లాడారు. 5వ తేదీన గనిలో మ్యాన్ రైడింగ్ ప్రారంభించిన నాటి నుంచి గైర్హాజరుశాతం తగ్గిందని, ఉత్పత్తి మెరుగైందని తెలిపారు. కార్యక్రమంలో ఎండీ రజాక్, జీవీ కోటిరెడ్డి, రవీందర్, పాలడుగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భారతజట్టు గెలుపుతో సంబురాలు

కొత్తగూడెంఅర్బన్: టీ–20 ప్రపంచకప్ విజేతగా భారత జట్టు నిలవడంతో ఆదివారం కొత్తగూడెం గాంధీపథం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. ట్రస్ట్ సభ్యులు జట్టుతో కూడిన బ్యానర్లతో ప్రదర్శన నిర్వహించి, అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షులు చింతలచెర్వు గిర్సోము మాట్లాడుతూ.. తుదిపోరులో భారత జట్టు అద్భుతంగా ఆడిందని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు జ్ఞానవినోదిని, కృపాకర్, అనిల్, బుజ్జి, ఎలిజబెత్ పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ సెంట్రల్ ఉపాధ్యక్షుడిగా కూసన


కూసన వీరభద్రయ్య

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) కొత్తగూడెం కార్పొరేట్, ఏరియా సెంట్రల్ ఉపాధ్యక్షుడిగా కూసన వీరభద్రయ్య, కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడిగా గడప రాజయ్య, కార్పొరేట్ ఏరియా ఉపాధ్యక్షుడిగా తుమ్మా శ్రీనివాస్‌ను ఎన్నుకున్నట్లు యూనియన్ ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ ఆదివారం తెలిపారు. ఇటీవల జరిగిన యూనియన్ సమావేశంలో ఈ కమిటీని ఎన్నుకున్నామని ఆయన పేర్కొన్నారు.

మడత రమ దంపతులకు పరామర్శ

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మడత రమ, వెంకట్‌గౌడ్ దంపతులను ఎమ్మెల్యే కోరం కనకయ్య పరామర్శించారు. ఆదివారం వరంగల్‌లోని మడత రమ తల్లి బాలసాని సరోజ ఇటీవల మృతిచెందటంతో ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

వారధి ఎన్నటికి నిర్మిస్తారో..?

- తూర్పుగూడెం వాగుపై నెరవేరని వంతెన కల
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు
- వంతెన నిర్మిస్తే తగ్గనున్న దూరభారం


తూర్పుగూడెం వాగుపై వంతెన నిర్మించాల్సిన ప్రదేశం ఇదే..


వర్షాకాలంలో వాగు దాటుతున్న స్థానికులు (ఫైల్)

సుజాతనగర్: అక్కడ వంతెన నిర్మిస్తే దాదాపు ఐదారు గ్రామాలకు బహుళ ప్రయోజనం చేకూరుతుంది. ఏళ్లుగా వంతెన లేకపోవడంతో పలు గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. వర్షాకాలంలో వరద నీరు తగ్గేంతవరకూ రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. సమస్యను ఎన్నో పర్యాయాలు పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనే చందంగా మిగిలిందే తప్ప ప్రయోజనం కలగలేదు. కొన్ని సమయాల్లో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాగు దాటాల్సి వస్తోందని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మాణంపై దృష్టి సారించాలని పాలకులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇల్లెందు మీదుగా వరద..

సుజాతనగర్ మండలంలోని బేతంపూడి, టేకులపల్లి మండలంలోని తూర్పుగూడెం గ్రామాల మధ్య తూర్పుగూడెం వాగు ఉంది. ఇల్లెందు మండలంలోని రోళ్లపాడు, చీమలపాడు దిగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీరంతా ఈ వాగుగుండా ప్రవహించి కొత్తగూడెం ముర్రేడువాగులో కలుస్తోంది. తూర్పుగూడెం వద్ద వంతెన నిర్మించాలని ఏళ్లుగా డిమాండ్ ఉన్నప్పటికీ నెరవేరడం లేదు. ఫలితంగా ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వానొస్తే రాకపోకలు బంద్

వంతెన నిర్మించాల్సిన ప్రదేశం వద్ద లోతు ఎక్కువగా ఉంటుంది. వర్షాకాలంలో ఈ ప్రాంతం పైనుంచి వరద నీరు పారుతూ రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. వరద నీరు తగ్గేంతవరకూ ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోతాయి. తప్పని పరిస్థితుల్లో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాగు దాటాల్సి ఉంటుంది. గతంలో వాగు దాటుతున్న క్రమంలో వరద ఉధృతికి కొట్టుకొనిపోయి ఇద్దరు వ్యక్తులు కూడా మృత్యువాత పడ్డారని గ్రామస్తులు చెబుతున్నారు.

నిర్మిస్తే కష్టాలు తీరినట్లే

ముత్యాలంపాడు, టేకులపల్లి పరిసర ప్రాంతాల ప్రజలు సుజాతనగర్ మీదుగా ఖమ్మం రావాలంటే ఈ దారి గుండా వస్తే సుమారు 30 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. వంతెన లేకపోవడంతో వర్షాకాలంలో వాగు దాటలేక సుజాతనగర్ వైపు నుంచి అటుగా వెళ్లాల్సిన వారు, అటునుంచి ఇటు రావాల్సిన వారు కొత్తగూడెం మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో అదనంగా 30 కి.మీ. ప్రయాణించడంతో పాటు, సమయం, డబ్బు వృథా అవుతున్నాయి. బేతంపూడి గ్రామంలో రైల్వే స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ముత్యాలంపాడు, టేకులపల్లి తదితర ప్రాంతాల ప్రజలు రైలు ప్రయాణం చేయాలంటే బేతంపూడి స్టేషన్‌కు వచ్చి రైలు ఎక్కుతుంటారు. వర్షాకాలంలో వాగు దాటేందుకు అవకాశం లేక కొత్తగూడెం వచ్చి రైలెక్కాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ గ్రామాల మధ్య ఎప్పటి నుంచో మట్టి రోడ్డే ఉండటంతో వానాకాలంలో బురదమయంగా మారి దారిలో నడవలేక అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం తూర్పుగూడెం గ్రామం వరకు బీటీ రోడ్డు సదుపాయం ఉంది. తూర్పుగూడెం వద్ద వంతెన నిర్మించడంతో పాటు, బేతంపూడి వరకూ బీటీ రహదారిని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వంతెన నిర్మించాలి..



తూర్పుగూడెం వాగు వద్ద వంతెన లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. వంతెన నిర్మించాలని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చాం. ఇక్కడ వంతెన నిర్మిస్తే ఏడెనిమిది గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బంది ఉండదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన నిర్మాణానికి కృషి చేయాలి.

–బానోత్ లలిత, బేతంపూడి మాజీ సర్పంచ్

ఇబ్బందులు తొలగించాలి



వాగు వద్ద వంతెన లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలంలో ఏటా వాగు ఉప్పొంగుతోంది. వరద నీరు తగ్గేంతవరకూ రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఒక్కోసారి ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వాగు దాటాల్సి వస్తోంది. వాగు ప్రవహిస్తున్న సమయంలో కొత్తగూడెం వెళ్లి రైలు ఎక్కాల్సి వస్తోంది.

–అజ్మీరా కిరణ్‌కుమార్, జామ్లాతండా

బ్లాక్ మార్కెట్‌కు ఎరువులు?

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని బంగారుచెలక గ్రామంలో కొందరు ఎరువుల దుకాణ యజమానులు ఇష్టానుసారంగా ఎరువులను బ్లాక్ మార్కెట్లకు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆదివారం ఓ ఎరువుల షాపు వద్దకు మూడు లారీలు వచ్చాయి. నిబంధనల ప్రకారం.. లారీలో వచ్చిన ఎరువులను గోదాములో దింపి, వివరాలు బోర్డుపై రాసి, బిల్లుల ద్వారా రైతులకు అందించాలి. కానీ, లారీ నుంచి నేరుగా ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో ఎలాంటి బిల్లులు లేకుండా ఎరువులను బ్లాక్ మార్కెట్లకు తరలించేందుకు దళారులకు అప్పగించారు. వ్యవసాయ అధికారులు పట్టించుకోక పోవటం వల్ల ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఈ విషయంపై ఏఓ రాకేశ్‌ను వివరణ కోరగా.. నిబంధనలకు విరుద్ధంగా ఎరువులు పంపిణీ చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రోజంతా కురిసిన వర్షం

ఇల్లెందురూరల్: వానాకాలం సీజన్‌లో ఇప్పటివరకు దోబూచులాడిన వరణుడు సకాలంలో కరుణించాడు. తొలకరిలో విత్తుకున్న పత్తి, మొక్కజొన్న విత్తనాలు మొలకలుగా మారగా నీటి తడులు అవసరమయ్యాయి. ఆ సమయంలో వర్షాలు పడకపోవడంతో రైతులు ఇబ్బందిపడ్డారు. పక్షం రోజుల తరువాత రోజంతా వర్షం కురవడంతో పంటలకు జీవం పోసినట్లయింది. దీంతో రైతులు సాగు పనులు మొదలు పెడుతున్నారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

ఇల్లెందు: ఆళ్లపల్లిలో పంచాయతీ కార్మికురాలు కుమారిని వేధిస్తున్న పంచాయతీ సెక్రెటరీ ప్రవీణ్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని ఇఫ్టూ జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలి డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న దళిత మహిళా కార్మికురాలితో ఇంటి పనులు చేయించుకుంటున్నాడని, పనులు చేయకపోతే విధుల నుంచి తొలగిస్తానని బెదిరిస్తున్నాడని ఆరోపించారు. తక్షణం ఆయన్ను సస్పెండ్ చేయాలని, కార్మికురాలికి అండగా నిలవాలని అధికారులను కోరారు.

'సీతారామ' నీళ్లు ఇవ్వాలని ఆందోళన


జూలూరుపాడు: నిరసన తెలుపుతున్న రైతులు


ఇల్లెందు: అఖిలపక్షం సమావేశంలో పాల్గొన్న నేతలు

జూలూరుపాడు: సీతారామ ప్రాజెక్టు కెనాల్ ద్వారా తరలించే గోదావరి జలాలు జూలూరుపాడు మండలంలోని సాగు భూములకు అందించాలని, గుండెపుడి పరిధిలోని రైతుల కోసం లిఫ్ట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామ రైతులు ఆదివారం ఆందోళన నిర్వహించారు. వీరభద్రాపురం గ్రామ సమీపంలోని సీతారామ కెనాల్‌లోకి రైతులు దిగి నిరసన తెలిపి, మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టు కెనాల్ ద్వారా తరలిస్తున్న గోదావరి జలాలతో జూలూరుపాడు మండలానికి సాగు, తాగునీటి అవసరాలు తీర్చేలా ప్రణాళిక రూపొందించాలని, ఇతర జిల్లాలకు నీళ్ల తరలించాలనే ప్రయత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. జూలూరుపాడు – ఏన్కూరు సీతారామ లింక్ కెనాల్‌తో గోదావరి జలాలను నాగార్జునసాగర్ ఎడమ కాలువకు కలపడం సరికాదని, మండలానికి సాగు, తాగునీటి సరఫరా చేయడంతోపాటు లిఫ్ట్ ఏర్పాటు చేయాలని కోరారు. కెనాల్ కోసం విలువైన పంట భూములను ఇచ్చామని, కానీ, ఈ ప్రాంతానికి నీరు అందకుండా పోతే ఏం చేయాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో రైతులు కొమ్మినేని కృష్ణమూర్తి, తూము కోటయ్య, పొన్నెకంటి వెంకటేశ్వర్లు, వేల్పుల గోపాలకృష్ణ, దుద్దుకూరి శ్రీనివాసరావు, గాదె కృష్ణయ్య, కల్యాణపు నరేశ్, కంచర్ల హరీశ్, గాదె సురేశ్, దొప్ప సత్యనారాయణ, మద్దెబోయిన నర్సింహారావు, నల్లమోతు కృష్ణయ్య, గోగుల సత్యనారాయణ, బాదావత్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలోనే పారాలి..

ఇల్లెందు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు సాగు తాగు నీరు అందించాలని 2016 ఫిబ్రవరి 16న నాటి సీఎం కేసీఆర్ టేకులపల్లి మండలం బేతంపూడిలో శంకుస్థాపన చేస్తే ఆ ప్రాజెక్టును రీడిజైన్ చేసి ఈ జిల్లాకు నీరు అందకుండా ఇతర జిల్లాలకు తరలించే ప్రయత్నం చేయటం దుర్మార్గమని అఖిలపక్ష నాయకులు స్పష్టం చేశారు. ఆదివారం ఇల్లెందు సీపీఐ కార్యాలయంలో అఖిలపక్ష నేతలతో జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడారు. ఒకనాడు దుమ్ముగూడెం ప్రాజెక్టుగా ఉండగా సీతారామ ప్రాజెక్టుగా మార్చారని, కాలువలు భద్రాద్రి కొత్తగూడెం రైతుల భూముల నుంచి వెళ్తుండగా నీరు మాత్రం ఇతర జిల్లాలకు తరలించే ప్రయత్నం కనిపిస్తోందని తెలిపారు. జిల్లా రైతాంగానికి సాగు, తాగు నీరు అందించిన తర్వాతనే ఇతర ప్రాంతాలకు నీరు వెళ్లాలని అఖిలపక్ష నేతలు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, దిండిగాల రాజేందర్, లక్కినేని సురేందర్, ఎస్‌ఏ నబీ, యదళ్లపల్లి సత్యం, తుపాకుల నాగేశ్వరరావు, దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, ఆలేటి కిరణ్, నూతలపాటి వెంకటేశ్వర్లు, శివనాయక్, బుర్ర వెంకన్న, బొల్లి కొమురయ్య, బజార్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం..


కృష్ణప్రసాద్‌ను సత్కరిస్తున్న కొత్వాల తదితరులు

పాల్వంచ: రాష్ట్రంలో కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కేటీపీఎస్ సీతారామ కల్యాణ మండపంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పాకాలపాటి కృష్ణయ్య సాంస్కృతిక కళాపీఠం ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయస్థాయి నాటకోత్సవాలు ఆదివారం మూడో రోజుకు చేరుకున్నాయి. అనంతరం కళాకారులను ఆయన సన్మానించారు. సర్టిఫికెట్లను అందించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం కట్టుబడి ఉందన్నారు. ఈ సందర్భంగా కళాకారుడు పుతుంబాక కృష్ణప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కళాకారులు కొండుం వెంకన్న, పాకాలపాటి రోశయ్యచౌదరి, యర్రంశెట్టి ముత్తయ్య, తాటికొండ నర్సింహారావు, పతంగి చెన్నారావు, ముత్యాల హనుమంతరావు, ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, నాగరాజు, గడ్డం ప్రసాద్, కల్యాణ్, పాతూరి రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పుస్తకాలు, పెన్నుల వితరణ


పుస్తకాలు, పెన్నులు అందిస్తున్న దృశ్యం

కొత్తగూడెంటౌన్: అన్ని దానాల్లో కెల్లా విద్యాదానం మిన్న అని రిటైర్డ్ ప్రిన్సిపాల్ రాయలింగు అన్నారు. ఆదివారం రామవరం సీఆర్‌పీ క్యాంప్ పాఠశాల విద్యార్థులు వంద మందికి శ్రీరాముల రాయమల్లు చారిటబుల్ ట్రస్ట్ (ఎస్‌ఆర్‌ఆర్) ఆధ్వర్యంలో పుస్తకాలు, పెన్నులు అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులకు పుస్తకాలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీరాముల విశ్వనాథ్, లక్ష్మీ దంపతులు, బండి విజయ్‌కుమార్, అనుదీప్, వెంకట్, మర్రి కృష్ణ, సంపత్, డేవిడ్, మెల్లం పురుషోత్తం, వేణు, రమేశ్, సిరిరాందేవ్, వీరు, రామకృష్ణ, కత్తి, శ్రీను, కృష్ణ, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి


ఉద్యమకారులను సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ తొలి దశ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ అనుబంధ మైనార్టీ నాయకులు, ఉర్దూఘర్ అధ్యక్షులు నయీంఖురేషి తెలిపారు. ఆదివారం ఉర్దూఘర్‌లో తొలి దశ ఉద్యమకారులను సన్మానించాక ఆయన మాట్లాడారు. ఉద్యమకారుల కోసం గత ప్రభుత్వం ఏమీ చేయలేదని, ప్రస్తుత ప్రభుత్వం ఉద్యమకారులకు రూ.5 వేలు పింఛన్, ఇల్లు లేని వారికి ఇంటి స్థలం, ఆరోగ్యశ్రీ కార్డు, ఉచిత బస్‌పాస్, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మహమ్మద్ షరీఫ్, జావీద్, మహ్మద్ జానీపాషా, అమీర్ ఖాద్రి, బాబు జానీ, దుమ్మిడి నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహాజన సభను జయప్రదం చేయాలి


ప్రచారం చేస్తున్న పీఏసీఎస్ సిబ్బంది

ఇల్లెందురూరల్: రైతు భరోసా పథకంపై రైతుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించేందుకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహిస్తున్న మహాజన సమావేశాన్ని జయప్రదం చేయాలని పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ప్రచారం నిర్వహించారు.

3న కలెక్టరేట్ వద్ద ధర్నా


మాట్లాడుతున్న గోనెల రమేశ్

టేకులపల్లి: కేజీబీవీల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోనెల రమేశ్ డిమాండ్ చేశారు. టేకులపల్లిలోని కేజీబీవీలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్కర్లు రోజుకు 12 గంటలపాటు పనిచేస్తున్నా శ్రమకు తగ్గ ఫలితం దక్కడం లేదన్నారు. ఈ నేపథ్యాన సమస్యల పరిష్కారం కోసం 3వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు, వర్కర్లు మదార్, సునీత, విజయ, సాలమ్మ, సునీత, ఉమ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు స్ఫూర్తితో రాణించండి..


అవార్డులు పొందిన వారితో రోటరీక్లబ్ సభ్యులు

కొత్తగూడెంఅర్బన్: అవార్డులను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు రాణించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరచారి తెలిపారు. రోటరీక్లబ్ ఆఫ్ కొత్తగూడెం ఆధ్వర్యంలో ఆదివారం పెన్షనర్స్ భవనంలో జరిగిన రోటరీ యంగ్ అచివర్స్ అవార్డు ప్రదాన కార్యక్రమానికి డీఈఓ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రోటరీక్లబ్ బాధ్యులు పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన, ఇన్‌స్పైర్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులకు అవార్డులు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం పీపీ పి.రాధాకృష్ణమూర్తి మాట్లాడారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ఆఫ్ కొత్తగూడెం అధ్యక్షులు పోసాని అరుణతోపాటు పి.సుజాత, అబ్రహం, ఎస్.సత్యనారాయణ, నాగరాజశేఖర్, యు.ఆనందకుమార్, పాపన్న పాల్గొన్నారు.

4న దొడ్డి కొమరయ్య వర్ధంతి సభ


మాట్లాడుతున్న మోకాళ్ల రమేశ్

ఇల్లెందురూరల్: న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఖమ్మంలో ఈనెల 4వ తేదీన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతి సభ నిర్వహిస్తున్నామని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల రమేశ్ తెలిపారు. మండలంలోని మస్సివాగు గ్రామంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో అత్యధిక శాతం భూమి భూస్వాములు, పెట్టుబడిదారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతిలో ఉందన్నారు. సమావేశంలో నాయకులు కిన్నెర రాజయ్య, రావూరి ఉపేందర్, కిన్నెర గోపాల్, లింబ, సమ్మయ్య, సత్యం, శ్రీను పాల్గొన్నారు.

వైద్య సేవలు అంతంతే..

- కేటీపీఎస్ ఆస్పత్రిలో వైద్యుల కొరత
- ఐదుగురు వైద్యులకు గాను ఒక్కరి నియామకం


కేటీపీఎస్ వైద్యశాల

పాల్వంచ: రాష్ట్రానికి వెలుగులు పంచేందుకు కృషి చేసే విద్యుత్ ఉద్యోగులకు వైద్య సౌకర్యాలు మృగ్యంగా మారాయి. రాష్ట్రంలోనే అత్యధిక ఉద్యోగులు కలిగిన కేటీపీఎస్ కాంప్లెక్స్ పరిధిలో సరైన వైద్య సేవలు అందడం లేదని వాపోతున్నారు. వైద్యుల కొరత ఇక్కడి ఆస్పత్రిని వేధిస్తోంది. జెన్‌కో ఆధ్వర్యంలో ఒక సూపరింటెండెంట్, ఒక వైద్యుడు మాత్రమే ఉన్నారు. ఇక హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేట్ కార్పొరేట్ వైద్యశాల ఆధ్వర్యంలో ఇక్కడ మరో ఐదుగురు వైద్యులు పనిచేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. కానీ, కొన్ని నెలలుగా ఒక్కరినే నియమించారు. మిగిలిన నలుగురు వైద్యుల నియామకం చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఉన్నవారిపై పనిభారం

కేటీపీఎస్ వైద్యశాలలో రోజుకు సుమారు 100 వరకు ఓపీ ఉంటుంది. సీజనల్ వ్యాధులు మొదలు, దీర్ఘకాలిక, ఇతర సమస్యలతో ఆస్పత్రికి వస్తుంటారు. కర్మాగారంలో అధిక కాలుష్యం వల్ల ఉద్యోగ, కార్మికులు నిత్యం ఏదో ఒక అనారోగ్య సమస్యతో బాధపడుతుంటారు. ఇక విధులు నిర్వహిస్తున్న సమయంలో అనుకోని ప్రమాదాలకు గురై హుటాహుటిన అంబులెన్స్‌ల ద్వారా ఆస్పత్రికి వస్తుంటారు. దీంతో ఉన్న ముగ్గురు వైద్యులు ఉదయం షిఫ్ట్‌లు చూసుకుంటున్నారని సాయంత్రం, రాత్రి సమయాల్లో కేవలం ఫోన్ కాల్ ద్వారా వచ్చే సమాచారంతో అప్పటికప్పుడు ఆస్పత్రికి వచ్చి పరీక్షించి వెళ్తున్నారు. ముఖ్యంగా కార్పొరేట్ వైద్యశాల ద్వారా ఏర్పాటు చేసిన వైద్యురాలు 24 గంటల సర్వీస్‌ను అందిస్తున్నట్లు తెలుస్తోంది. కర్మాగారంలో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం బారిన పడుతారో అర్థం కాని పరిస్థితి ఉన్న నేపథ్యంలో వైద్యులు సాయంత్రం వేళల్లో లేకపోతే పరిస్థితి ఏంటని పలువురు ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సూపర్ స్పెషాలిటీ వైద్యం ఏది?

ఇక్కడ సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలని కొన్ని సంవత్సరాలుగా ఉద్యోగ కార్మిక సంఘల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఆస్పత్రిలో సరిపడా వసతులు ఉన్న నేపథ్యంలో వాటిని సద్వినియోగం చేసుకుని ఆస్పత్రిని విస్తరించడంతో పాటు, అన్ని రకాల స్పెషలిస్ట్ వైద్యులను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కానీ, ఇక్కడ కనీసం స్పెషలిస్ట్ వైద్యుల నియామకం లేకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ విషయంపై కేటీపీఎస్ 7వ దశ సీఈ వెంకటేశ్వరరావును వివరణ కోరగా.. ఐదుగురు డాక్టర్లను కేటాయించాల్సి ఉన్నప్పటికీ ఒక్కరే ఉన్నారని, మిగిలిన నలుగురి నియామకం కోసం యాజమాన్యానికి లేఖ రాశామని తెలిపారు.